

# కానుక

గోగుల ప్రభాకరరావు

ముచ్చటగా మూడోసారి కూడా పిలుపొచ్చింది రామాయమ్మకు పక్కింటి పంకజమ్మ నుంచి, అమ్మాయిని పెళ్ళి కూతురును చేస్తున్నాము-వచ్చి దీవించి వెళ్ళమని.

వెళ్ళిరావాలి. వెళ్ళకపోతే బాగుండదు. పెళ్ళి ఎలాగూ ఏలూరులో కనుక తను అంతదూరం వెళ్ళలేదు. పక్కింట్లో పెళ్ళి కూతురును చేస్తున్నప్పుడైనా వెళ్ళి చూసి రావాలి. తను మొదట్నించీ అంతే. అలాగే అలవాటైపోయింది. ఎక్కడికీ వెళ్ళాలని అనిపించదు. అదో తత్వం. అలాగని ఇది మాత్రం మానెయ్యటానికి వీలులేదు. పంకజమ్మ తనను అంత తేలిగ్గా వదలదు. అవునుమరి వాళ్ళ 'బంధం' అటువంటిది. సరే వెళ్దామని నిర్ణయాని కొచ్చేసింది. కానీ వట్టి చేతులతో వెళ్ళటం బాగోదు. ఏదైనా కానుక ఇవ్వాలి. ఏమిస్తే బాగుంటుంది? ఇవ్వటానికి తన దగ్గర డబ్బు కూడా సమ్మయానికి లేదే! నెలాఖరు రోజులు. ఆయన్ని అడిగితే గయ్ మని లేస్తారు. అందుకేనేమో నగం తనకు వెళ్ళాలని అనిపించటంలేదు. కానీ తప్పదు. ఎలా? సందిగ్ధావస్థలో పడిన రామాయమ్మకు మరో పిలుపు-ఈసారి స్వయంగా పంకజమ్మే ఊడిపడింది.

"ఏంటి వదినా ఇంత ఆలస్యం? ఇంట్లో అన్నయ్యగారు లేరా?" అంటూ వచ్చింది.

"ఇదిగో! వచ్చేస్తున్నా" !రామాయమ్మ జవాబు.

"త్వరగా రావాలి మరి!" అంటూ వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయింది పంకజమ్మ.

'ఇక తప్పదు గాక తప్పదు' అని ఆలోచిస్తుండగానే మెరుపు లాగా ఓ ఆలోచన వచ్చింది. అంతే! ఇక క్షణం ఆలస్యం చేయలేదు. డ్రాయింగ్ రూములో జొరపడి, పది నిమిషాల్లో పనిపూర్తి చేసుకుని, పట్టు చీరలో పంకజమ్మ ఇంట్లోకి అడుగుపెట్టింది రామాయమ్మ.

అమ్మాయిని దీవించి తను భద్రంగా తీసుకెళ్ళిన కవరు పిల్ల చేతిలో పెట్టింది. ఇంతలో కరెంటు పోయింది. అయితేనేం? అదిచూసిన పంకజమ్మ కంటి వెలుగులో దారి స్పష్టంగా కన్పిస్తుంటే ఇంటికి చక్కావచ్చేసింది రామాయమ్మ.

రెండు రోజుల తర్వాత..

పెళ్ళి కాగానే అప్పటి వరకూ ఆపుకున్న ఉద్వేగాన్ని అణుచుకుంటూ పంకజమ్మ కూతురుకు వచ్చిన ప్రెజెంటేషన్సు ముందు వేసుకుని ఒక్కొక్కటే తెరిచి చూస్తూ మురిసి పోతూ రామాయమ్మ ఇచ్చిన కవరు రాగానే ఆగిపోయింది.

"ఏమిచ్చుంటుందబ్బా? పెద్ద మనసు గలది. కవరు బరువును బట్టి కట్నం ఘనంగానే ఉన్నట్లుంది" అనుకుంటూ కవరు బర్రున చించి కవరులోకి తొంగి చూసింది ఆనందంతో.

రెండు నిమిషాలు గడిచాయి. పంకజమ్మ మొహం తెల్లగా పాలిపోయింది. ఆనందం ఇగిరి పోయింది. ఆవేశం కట్టలు తెంచుకుంది.

"అమ్మ రామాయమ్మా ! ఎంత దెబ్బకొట్టావ్!" అనుకుంది.

అందులో గత ఆరునెలలుగా తను రామాయమ్మ దగ్గర అప్పుగా తీసుకున్న 'వెచ్చాల లిస్టు' ఉంది. తను ఎలాగూ తీసుకున్నవి తిరిగి ఇవ్వదు. అది గ్రహించిన రామాయమ్మ తెలివిగా పంకజమ్మ అప్పుగా తీసుకున్నవన్నీ తాను అమ్మాయికి చదివించినట్లుగా రాసింది. అవి అమ్మాయికి తానిచ్చిన 'కానుక'గా భావించమని రాసింది.

అదీ సంగతి!

★